S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 66 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 8 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



## గ్యాస్ వినియోగదారులకు శుభవార్త

- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నియమం

4

## ఫేక్ వీడియో అని తెలియదు

- వివాదంపై అభిజిత్ దీప్కే వివరణ
- రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో పేరుతో వీడియో షేర్
- తప్పుడోవ పట్టించే పోస్టంటూ నెటిజన్ల విమర్శలు
- వ్యక్తిగత జీవితంపై అభ్యంతరం లేదన్న దీప్కే

4





# సేవతోనే వికసిత్ భారత్

స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు దేశానికే ఆదర్శం

## యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



- నెల్లూరు జిల్లాలో ట్రస్ట్ రజతోత్సవ వేడుకలకు హాజరు
- ఉత్తర, దక్షిణ భారతానికి వెంకయ్యనాయుడు సాంస్కృతిక వారధి
- వేంకటేశ్వర స్వామివారి దర్శనం

**నెల్లూరు (సమయం న్యూస్):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసం, నిస్వార్థ ప్రజాసేవలో గత 25 ఏళ్లుగా 'స్వర్ణభారత్ ట్రస్ట్' అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రశంసించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన 'స్వర్ణభారత్-సేవా హారతి' రజతోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజ సేవతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన సరళత, నిరాడంబరమైన వ్యక్తిత్వంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారని యోగి

మిగతా 2లో..



# నాయకత్వానికి కేరాఫ్ టీడీపీ



## స్థానిక సమరానికి టీడీపీ సై!

- 28 జిల్లాలకు ఇన్‌ఛార్జుల నియామకం
- అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎంపీలు, ఎమ్మెల్యేలకే
- కుప్పం నేతలకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు

2

### అసత్యాలను ప్రచారం చేయడంలో వైసీపీకి నైపుణ్యం

### ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్స్‌తో దీటుగా తిప్పికొట్టాలి

ఉగ్రవాదుల్లా హిట్-రన్-హైడ్ పద్ధతిలో గొడ్డలి పార్టీ రాజకీయం

ఎమ్మెల్యేలు, నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు

**అమరావతి (సమయం న్యూస్):** పోలవరం సహా రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులనూ నిర్దేశిత గడువులోగా పూర్తిచేసి, ప్రతి ఎకరాకూ నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనను 'వాటర్‌మెన్'గా ఎకనామిక్ టైమ్స్ పేర్కొనడం సంతోషంగా ఉందని, జల సంరక్షణపై చేస్తున్న కష్టానికి దక్కిన గుర్తింపని ఆయన అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నేతల్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ పాలనలో ముందుకు వెళ్తున్నామని, కష్టకాలంలో నిలబడిన కార్యకర్తకు పార్టీలో పూర్తి గౌరవం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఓటే గీటు రాయిగా పనిచేస్తూ 2029లో మరింత మెరుగైన ఫలితాలను సాధిద్దామని నేతల్లో ఉత్సాహం నింపారు. ఎల్ నినో విపత్తుపై అంతా అప్రమత్తంగా ఉండాలని, దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్త బలంగా ఉండాలని, రాజకీయ పార్టీ బలపడటం ఎంత ముఖ్యమో.. కూటమి

మిగతా 2లో

# వృద్ధురాలిపై సీఐ దౌర్జన్యం!

చీరాలలో కార్డన్ సెర్చ్ పేరిట అసభ్య పదజాలంతో దూషణ

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సీఐ శశికుమార్ వీడియో

ఎస్టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన మహిళపై ప్రతాపం



3



## తిరుపతికి మరో వందే భారత్!

బెంగళూరు మీదుగా శివమొగ్గ నుంచి రాకపోకలు

2

# లోకేశ్ రాజీనామా చేయాల్సిందే!

- కుమారుడిని కాపాడుకునేందుకు చంద్రబాబు ఆరాటం
- డీఎస్సీ అక్రమాలపై సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్



3



# ప్రజలకు గోరంత.. వాళ్లకు కొండంత!

ఏపీకి మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరం

- ఆ రెండు పార్టీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం
- సీఎం స్థానంలో రెడ్డి, కమ్మ వాళ్లే ఉండాలా?
- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

..వివరాలు 2లో

# ఢిల్లీలో మన ఊరి రుచులు

ఏపీ భవన్‌లో ప్రత్యేక అవుట్‌లెట్ ఏర్పాటు

ధరల నియంత్రణపై ఎన్సీసీఎఫ్ ఎండీతో మంత్రి నాదెండ్ల కీలక చర్చలు



.. వివరాలు 2లో

# ప్రజలకు గోరంత.. వాళ్లకు కొండంత!

**ఏపీకి మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరం**

**ఆ రెండు పార్టీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం**

**సీఎం స్థానంలో రెడ్డి, కమ్మ వాళ్లే ఉండాలా?**

**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి**

**విజయవాడ (సమయం న్యూస్):** 'అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే' అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన.. భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాను పెట్టబోయే కొత్త పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటార్'గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు.



రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని, ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే కొత్త పార్టీ ఉద్భవిస్తోందని విజయసాయి స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? అని ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని, తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యం యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని, ఆ సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

**వాళ్లవి ఫ్యాక్షన్ రాజకీయాలు..**

త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని విజయసాయి స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరమన్న విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. వీరికి పోలీసుల మద్దతు కూడా ఉందని వ్యాఖ్యానించారు. టీడీపీ, వైసీపీలను ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలుగా విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలూ పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. 'ప్రజలకు గోరంత, తమకు కొండంత' అన్నట్లుగా ఆ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కిచెప్పారు.

# తిరుపతికి మరో వందే భారత్!

**బెంగళూరు మీదుగా శివమొగ్గ నుంచి రాకపోకలు**

**ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తికి రైల్వే బోర్డు సానుకూల స్పందన**

**శ్రీవారి భక్తులతో పాటు ప్రయాణికులకు ఎంతో సౌకర్యం**



**అమరావతి (సమయం న్యూస్):** తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు, కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శాఖ తీపి కబురు అందించింది. కర్ణాటకలోని శివమొగ్గ టౌన్ నుంచి బెంగళూరు మీదుగా ఏపీలోని ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి నూతన 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైలును ప్రారంభించాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది.

**సానుకూలంగా స్పందించిన రైల్వే బోర్డు..**

శివమొగ్గ, తిరుపతి మధ్య బెంగళూరు మీదుగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలన్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అభ్యర్థనకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ సర్వీసు కోసం అధికారిక ప్రతిపాదనను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. నైరుతి రైల్వే రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ఈ ప్రతిపాదనను చేర్చారు. తన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నందుకు రైల్వే బోర్డు చైర్మన్, సీఈవోకు ఎంపీ గురుమూర్తి ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన లాంఛనాలను వేగంగా పూర్తి చేసి ఈ సేవలను త్వరలోనే ప్రారంభించాలని అధికారులను ఆయన కోరారు.

**భక్తులకు, ప్రయాణికులకు వరం..**

ప్రతిపాదిత రైలు తిరుపతి, శివమొగ్గ, బెంగళూరు మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. దీని ద్వారా యాత్రికులకు, ఉన్నత విద్య, వైద్యం, వ్యాపారం తదితర అవసరాల కోసం ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కర్ణాటకలోని శివమొగ్గ, బెంగళూరు పరిసర ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుంది. బెంగళూరు, తిరుపతి మధ్య రాకపోకలు సాగించే వారికి అత్యంత వేగవంతమైన, సుఖవంతమైన రవాణా సౌకర్యం లభిస్తుంది.

# నాయకత్వానికి కేరాఫ్ టీడీపీ!

(మొదటిపేజీ తరువాయి..)

ఐక్యత కూడా అంతే ముఖ్యమని సీఎం దిశానిర్దేశం చేశారు. ఫొటోల గురించి, ఫ్లెక్సీల గురించి వివాదాలు వద్దని, కూటమిగా కలిసి క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. పనిచేయటంతో పాటు, ఆ చేసిన పనిని సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం కూడా ముఖ్యమన్నారు. నాయకత్వానికి కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం పార్టీ అని ముఖ్యమంత్రి అన్నారు. వర్తమానాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తును అంచనా వేయాలన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై నిలబెట్టారని, వ్యవస్థలను విధ్వంసం చేశారని మండిపడ్డారు. వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దని, ఫ్యాక్ట్‌తో గట్టిగా కౌంటర్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నేతలకు దిశానిర్దేశం చేశారు. ఆ పార్టీ ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ విధానాన్ని అనుసరిస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆ పార్టీ చేస్తున్న వక్రీకరణలకు దిమ్మతిరిగేలా సమాధానం చెప్పాలన్నారు.

**వాటర్‌మ్యాన్‌కు స్టాండింగ్ ఓవేషన్..**

అంతకుముందు కాంక్లేవ్‌లో 'సీఈఓ సీఎం టు వాటర్‌మ్యాన్' అంటూ ఎకనామిక్ టైమ్స్ రాసిన కథనంపై జలవనరుల శాఖ



మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఒకప్పుడు ఐటీకి ప్రాధాన్యం ఇచ్చి తెలుగు యువతను ఐటీ నిపుణులుగా మార్చిన సీఎం.. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణతో వాటర్‌మ్యాన్‌గా మారారని ఆయన కొనియాడారు. పుష్కరాలకంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తారన్న లక్ష్యాన్ని కూడా ఈటీ కథనంలో పేర్కొందని వివరించారు. సీఎం చేస్తున్న కృషికి గానూ పార్టీ నేతలంతా స్టాండింగ్ ఓవేషన్‌తో అభినందనలు తెలిపారు.

# స్థానిక సమరానికి టీడీపీ సై!

**28 జిల్లాలకు ఇన్‌ఛార్జుల నియామకం**

**అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎంపీలు, ఎమ్మెల్సీలకే**

**కుప్పం నేతలకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు**

**అమరావతి (సమయం న్యూస్):** ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సమాయత్తమవుతోంది. ఈ మేరకు కసరత్తు వేగవంతం చేస్తూ రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జులను నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈసారి సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఆ బాధ్యతను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీలోని ఇతర కీలక నేతలకు అప్పగించింది. అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను క్రియాశీలం చేయడంతో పాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగేలా ఇన్‌ఛార్జులకు బాధ్యతలు అప్పగించారు. విజయనగరానికి ఎంపీ చింతకాయల విజయ్, తూర్పుగోదావరికి దేవినేని ఉమామహేశ్వరరావు, పల్నాడుకు కొనకళ్ల నారాయణ, పశ్చిమగోదావరికి ఎంపీ భాష్యం రామకృష్ణ తదితర సీనియర్లకు కీలక బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, నేతలు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఫలితాల్లో ఏమాత్రం తేడా వచ్చినా సహించేది లేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. త్వరలోనే తాను కుప్పంలో పర్యటిస్తానని కూడా చంద్రబాబు వెల్లడించారు.

# సేవతోనే 'వికసిత్ భారత్'



(మొదటిపేజీ తరువాయి..)

కొనియాడారు. ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య వెంకయ్యనాయుడు సాంస్కృతిక వారధిగా పనిచేశారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానం, స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవా ప్రస్థానం ఒకేసారి పూర్తికావడం ఆనందదాయకమన్నారు. ఈ రెండు ప్రస్థానాల ఆశయం 'వికసిత్ భారత్' నిర్మాణమే అని పేర్కొన్నారు. ముందుగా అక్షర విద్యాలయ ప్రాంగణాన్ని, సోమా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించిన సీఎం యోగి.. విద్యార్థులు, శిక్షణార్థులతో ముచ్చటించారు.

**గ్రామాలే బలమైన పునాదులు..**

భారతదేశంలో గ్రామాలు ఒకప్పుడు జ్ఞానం, సంస్కృతి, జల సంరక్షణ, ఆర్థిక వ్యవస్థకు కేంద్రాలుగా ఉండేవని యోగి తెలిపారు. పశుపోషణ, గ్రామీణ చేతివృత్తులు, ఉత్పత్తి అన్నీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమై ఉండేవని వివరించారు. మహాత్మా గాంధీ కలలుగన్న 'గ్రామ స్వరాజ్యం', నానాజీ దేశ్‌ముఖ్ రూపొందించిన చిత్రకూట్ నమూనా స్ఫూర్తితో ట్రస్ట్ గ్రామీణ సాధికారతకు కృషి చేస్తోందని ప్రశంసించారు. చదువుకు దూరమైన పిల్లలకు అండగా నిలుస్తున్న బ్రిడ్జ్ స్కూల్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీవారి సేవలో యోగి ఆదిత్యనాథ్..**

స్వర్ణభారత్ ట్రస్ట్ వేడుకల్లో పాల్గొనడానికి ముందు ఏపీకి విచ్చేసిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్.. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా తిరుమల చేరుకున్న ఆయన.. సోమవారం సాయంత్రం శ్రీవాణి ట్రస్ట్ ప్రత్యేక దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. టీటీడీ అదనపు ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి ఆయనకు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా, అధికారుల ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకుముందు ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో యోగికి మంత్రులు సత్యకుమార్ యాదవ్, నారాయణ, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఘన స్వాగతం పలికారు.

# ఢిల్లీలో మన ఊరి రుచులు

- ఏపీ భవన్‌లో ప్రత్యేక అవుట్‌లెట్ ఏర్పాటు
- కేఎన్‌ఎం, బీపీటీ రకాలతో పాటు నాణ్యమైన నిత్యావసరాలు లభ్యం
- ధరల నియంత్రణపై ఎన్సీసీఎఫ్ ఎండీతో మంత్రి నాదెండ్ల కీలక చర్చలు

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించేందుకు ఏపీ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'రైస్ అవుట్‌లెట్'ను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని మంత్రి నాదెండ్ల కొనియాడారు. ఢిల్లీ నగరంలో స్థిరపడిన తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. కేఎన్‌ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్సీసీఎఫ్ ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు



తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు.

**ధరల నియంత్రణపై ఎన్సీసీఎఫ్ ఎండీతో చర్చలు..**

ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్సీసీఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన పటిష్ఠ చర్యలపై ఆయనతో చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధనలో కేంద్ర ప్రభుత్వ సంస్థల సహకారాన్ని మరింత విస్తృతం చేస్తూ ముందుకు వెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

**శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్**


**హైదరాబాద్,సెప్టెంబర్1:** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# నిరుద్యోగులపై బురదజల్లుతారా?

**కష్టపడి మెగా డీఎస్సీ సాధించారు**

**ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఫైర్**

**అమరావతి,సెప్టెంబర్7:** మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు.



వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

# జిల్లాలే ఎగుమతి కేంద్రాలు

- గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న కేంద్రం
- రూపాంతరం చెందిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్
- స్థానిక ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ సౌకర్యం
- ఎగుమతిదారులకు శిక్షణ.. ఎగుమతులకు ప్రోత్సాహం



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** భారత్ ఎగుమతులను కొన్ని పారిశ్రామిక కేంద్రాలు, ఓడరేవు నగరాలకే పరిమితం చేయకుండా ప్రతి జిల్లానూ ప్రపంచ వాణిజ్యంతో అనుసంధానించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. 'ఎగుమతి కేంద్రాలుగా జిల్లాలు' కార్యక్రమం ద్వారా స్థానికంగా ప్రత్యేకత కలిగిన ఉత్పత్తులు, సేవలను గుర్తించి, వాటికి అంతర్జాతీయ మార్కెట్లలో స్థానం కల్పిస్తోంది. జిల్లా స్థాయిలో మౌలిక సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాలు, ప్యాకేజింగ్, బ్రాండింగ్, రవాణా వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం.

### రికార్డు స్థాయికి భారత ఎగుమతులు

భారత ఆర్థిక వృద్ధిలో ఎగుమతులు కీలక చోదకశక్తిగా నిలుస్తున్నాయి. దేశ వస్తు, సేవల మొత్తం ఎగుమతులు 2024-25లో రికార్డు స్థాయిలో 825.25 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరాయి. 2025-26లో ఇవి 863.11 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగినట్లు అంచనా. విదేశీ మార్కెట్ల నుంచి వచ్చే ఆదాయం దేశీయ పరిశ్రమల విస్తరణ, కొత్త ఉపాధి, స్థానిక ఆదాయ వృద్ధికి ఊతమిస్తోంది. ఈ ప్రగతిని దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు జిల్లా ఆధారిత ఎగుమతి నమూనాను ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది.

### గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచ అవకాశాలు

దేశంలోని చిన్న పట్టణాలు, గ్రామీణ జిల్లాలు, మారుమూల ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయి సామర్థ్యం కలిగిన అనేక ఉత్పత్తులు ఉన్నాయి. సరైన మార్కెట్ సమాచారం, నాణ్యతా ధ్రువీకరణ, రవాణా సౌకర్యం లేకపోవడంతో గతంలో ఇలాంటి ఉత్పత్తులు ఎగుమతి మార్కెట్లను చేరలేకపోయాయి. డీఈహెచ్ కార్యక్రమం ఈ లోటును అధిగమిస్తూ స్థానిక ఉత్పత్తిదారులను ప్రపంచ కొనుగోలుదారులతో అనుసంధానిస్తోంది.

### ఓడీఓపీగా మొదలై డీఈహెచ్‌గా రూపాంతరం

'ఎగుమతి కేంద్రాలుగా జిల్లాలు' కార్యక్రమానికి 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' భావనే పునాది. 2018లో ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమైన ఓడీఓపీ కార్యక్రమం ప్రతి జిల్లాలోని ప్రత్యేక ఉత్పత్తికి బ్రాండ్ గుర్తింపు, మార్కెట్ అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టింది. మొరాదాబాద్ ఇత్తడి పరిశ్రమను కేంద్రంగా చేసుకొని రూపుదిద్దుకున్న ఈ నమూనా తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించింది. విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ పరిధిలో డీఈహెచ్ కార్యక్రమం ద్వారా ఉత్పత్తుల ప్రచారం నుంచి సమగ్ర ఎగుమతి వ్యవస్థ నిర్మాణం వరకు లక్ష్యాలను విస్తరించారు. 2026 జనవరి నాటికి 770కి పైగా జిల్లాలు ఈ కార్యక్రమ పరిధిలోకి వచ్చాయి. తెలంగాణలోని 31 జిల్లాలకు కూడా ఈ అవకాశం లభించింది.

### ప్రపంచ ప్రమాణాలే లక్ష్యం

ఉత్పత్తిని గుర్తించడం ఒక్కటే ఎగుమతి విజయానికి సరిపోదు. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు, పరీక్షలు, ప్యాకేజింగ్, బ్రాండింగ్, ధ్రువీకరణ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఈ అంశాలపై స్థానిక తయారీదారులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు డీఈహెచ్ అవగాహన, శిక్షణ అందిస్తోంది. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల నాణ్యతను పెంచడం ద్వారా జిల్లాల ఎగుమతి పోటీ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తోంది. అమెజాన్, షిప్‌రాకెట్, డీహెచ్‌ఎల్ వంటి ఈకామర్స్ సంస్థలతో కుదిరిన భాగస్వామ్యాలు స్థానిక వ్యాపారాలకు తక్కువ ఖర్చుతో కూడిన రవాణా అవకాశాలను అందిస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లోని చిన్న సంస్థలు కూడా డిజిటల్ వేదికల ద్వారా విదేశీ కొనుగోలుదారులను చేరుకోగలుగుతున్నాయి. డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాలు పత్రాల నిర్వహణ, ప్యాకేజింగ్, చిన్న సరకు రవాణా కోసం తక్కువ ఖర్చుతో కూడిన తపాలా ఎగుమతి సేవలను అందిస్తూ ఈ పరిధిని మరింత విస్తరిస్తున్నాయి.

### ఎగుమతిదారులకు నైపుణ్య శిక్షణ

రవాణా ప్రణాళిక, ఎగుమతి ప్రక్రియలు, ప్యాకేజింగ్ ప్రమాణాలు, నియంత్రణ నిబంధనలపై విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా యంత్రాంగాలు సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈసీజీసీ, హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక మండలి, భారత ఎగుమతి సంస్థల సమాఖ్య, కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, భారత తపాలా విభాగం, ఎగ్జిమ్ బ్యాంక్ వంటి సంస్థలు సహకారం అందిస్తున్నాయి. చెల్లింపుల సమస్యలు, కొనుగోలుదారుల విశ్వసనీయత, ధ్రువీకరణ వంటి సవాళ్లపై కూడా ఎగుమతిదారులకు అవగాహన కల్పిస్తున్నాయి.

### ట్రిలియన్ డాలర్ల లక్ష్యం దిశగా

2026 జూన్ 1 నుంచి డీఈహెచ్ కార్యక్రమ అమలులో ఫలితాల ఆధారిత, లక్షిత, దశలవారీ విధానాన్ని ప్రభుత్వం చేపట్టింది. తొలి దశలో 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని జిల్లాలను ఎంపిక చేశారు. విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్‌కు చెందిన 24 ప్రాంతీయ కార్యాలయాలు, 11 భాగస్వామ్య సంస్థలు అమలుకు మద్దతు ఇస్తున్నాయి. కొత్త ఎగుమతిదారుల నమోదు, ఎగుమతుల విలువ పెంపు, స్థానిక ఉపాధి సృష్టి వంటి కొలవదగిన ఫలితాలపై దృష్టి సారించారు. ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఎగుమతి లక్ష్యం దిశగా భారత్ సాగుతున్న వేళ, ప్రతి జిల్లాను వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధికి కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించనుంది.

# లోకేశ్ రాజీనామా చేయాల్సిందే!

**డీఎస్సీ అక్రమాలపై సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్**

**కుమారుడిని కాపాడుకునేందుకు చంద్రబాబు ఆరాటం**



**తాడేపల్లి (సమయం న్యూస్):** డీఎస్సీ వ్యవహారంలో రోజురోజుకూ కొత్త ఆధారాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీఎస్సీ ప్రక్రియలో ఉపాధ్యాయ పోస్టులను డబ్బులకు అమ్మకానికి పెట్టినట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఈ కుంభకోణంలో అన్ని వేళ్లూ లోకేశ్ వైపే చూపిస్తున్నాయని, ఆయన బాధ్యత నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. కొడుకును కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత మంత్రితో కాకుండా అధికారులతో మాట్లాడిస్తున్నారని ఆయన ఆరోపించారు.

### కేంద్ర సంస్థతో విచారణ జరపాలి..

డీఎస్సీ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరుగుతుందన్న నమ్మకం కలగాలంటే కేంద్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించాలని సజ్జల డిమాండ్ చేశారు. క్రీడా కోటా నియామకాల్లో అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు రాకపోగా కేవలం పాల్గొన్నట్లు ధ్రువపత్రాలు ఉన్నవారికి పోస్టులు ఇచ్చారని ఆరోపించారు. అవసరమైన పని పూర్తయ్యాక జీవోలు జారీ చేయడం, రద్దు చేయడం వంటి పరిణామాలు అక్రమాలను బలపరుస్తున్నాయన్నారు. పరీక్ష పేపర్ లీక్ అయినట్లు, టాపర్‌కు ప్రశ్నల బ్యాంక్ ముందే అందినట్లు ఆరోపణలు వస్తున్నాయని, ఈ విషయం బయటపడగానే ఆ అభ్యర్థి పేరును మెరిట్ జాబితా నుంచి తొలగించారని గుర్తుచేశారు.

### సమాధానం చెప్పకుండా పలాయనవాదం..

డీఎస్సీ అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తున్న మీడియా సంస్థల సామాజిక మాధ్యమాల ఖాతాలను అకారణంగా నిలిపివేస్తూ ప్రభుత్వం వారి గొంతు నొక్కుతోందని సజ్జల విమర్శించారు. వైఎస్ జగన్ డేటాతో సహా లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని దుయ్యబట్టారు. ఈ వ్యవహారంపై లోకేశ్ పదేపదే గొప్పలు చెబుతున్నారని, కానీ శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ అడిగిన ప్రశ్నలకు బదులివ్వలేక వెనుకడుగు వేశారని సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు.

# వృద్ధురాలిపై సీఐ దౌర్జన్యం!

**చీరాలలో కార్డన్ సెర్చ్ పేరిట అసభ్య పదజాలంతో దూషణ**

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సీఐ శశికుమార్ వీడియో**

**ఎస్టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన మహిళపై ప్రతాపం**

**బాపట్ల (సమయం న్యూస్):** బాపట్ల జిల్లా చీరాలలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సమయంలో రెండో పట్టణ సీఐ శశికుమార్ ఒక వృద్ధురాలి పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. చట్టాలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి, ఒక వృద్ధురాలిని ఉద్దేశించి పబ్లిక్‌గా అసభ్య పదజాలంతో దూషించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. చీరాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో ఆదివారం పోలీసు బలగాలు కార్డన్ సెర్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఓ ఇంటి బయట ఉన్న ఎస్టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వృద్ధురాలితో సీఐ శశికుమార్ అత్యంత అసభ్యంగా మాట్లాడారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డు కాగా, ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాల్సిన పోలీసులు.. సామాన్యుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుండటం పోలీసుల ప్రతిష్టను మసకబారుస్తోందని ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు.

### మార్గదర్శకాలు తుంగలోకి..

శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహించే హక్కు పోలీసులకు ఉన్నప్పటికీ, ఆ సమయంలో పౌరుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే హక్కు ఏ చట్టమూ ఇవ్వలేదు. పోలీసు మాన్యువల్, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం విధుల్లో ఉన్న ఏ పోలీసు అధికారి కూడా పౌరులను దూషించకూడదు. మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాలతో అత్యంత గౌరవప్రదంగా వ్యవహరించాలి. ఎవరినైనా పబ్లిక్‌గా బూతులు తిట్టడం లేదా అవమానించడం భారతీయ న్యాయ సంహిత ప్రకారం నేరంగా పరిగణిస్తారు. నిబంధనలను ఉల్లంఘించి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన సీఐ శశికుమార్‌పై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలపై సాక్ష్యాలతో సహా డీఎస్పీ, ఎస్పీ లాంటి ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. పౌరులను బూతులు తిట్టడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది కాబట్టి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించి కూడా బాధితులు న్యాయం కోరే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ డిజైన్, డీపీఆర్ పనులు ప్రారంభం

**సర్వే ప్రారంభించిన ఐఐటీ మద్రాస్**

**తీర ప్రాంతం వెంబడి ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం డ్రోన్ సర్వే**

**అత్యాధునిక సాంకేతికతతో బీచ్ ప్రొఫైల్, తీరాల మ్యాపింగ్ చేస్తున్న బృందం**

**తీరం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాల సేకరణ, పరీక్షలు**

**అధ్యయనం పూర్తయిన అనంతరం రక్షణ గోడ అలైన్‌మెంట్‌పై కసరత్తులు**

**మంగళగిరి, సెప్టెంబర్ 7:** పిఠాపురం నియోజక వర్గంలోని ఉప్పాడ తీర ప్రాంతవాసుల దశాబ్దాల కల సాకారం దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం దిశగా కీలక అడుగులు ప్రారంభమయ్యాయి. రక్షణ గోడ నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్న ఐఐటీ- మద్రాస్ పనిని ప్రారంభించింది. రూ. 323 కోట్లనేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్‌తో నిర్మితమవుతున్న ఈ రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఐఐటీ మద్రాస్ ప్రతినిధి బృందం అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సముద్ర గర్భంలోనూ, తీర ప్రాంతం వెంబడి సర్వే చేపట్టింది. తీర ప్రాంత ఇంజినీరింగ్, సముద్ర పరిశోధనల్లో విశేష అనుభవం కలిగిన ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం గత వారం రోజులుగా ఉప్పాడ తీర ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వేలు చేపట్టింది. అధునాతన డ్రోన్లతోపాటు బీచ్ ప్రొఫైలింగ్, తీర ప్రాంతాల మ్యాపింగ్ కోసం ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే సాంకేతికతను వినియోగిస్తున్నారు. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సముద్ర అలల ప్రభావం, తీర కోత తీవ్రత, భూభాగ మార్పులు, సముద్ర ప్రవాహాల దిశలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నీటి అడుగు భాగం నుంచి బీచ్ వరకు ఇసుక కణాల సేకరణ, సమగ్ర అధ్యయనం సాగుతోంది. వీటితోపాటు ఉప్పాడ తీర ప్రాంతం వెంబడి ఇసుక, మట్టి అవశేషాల నమూనాలు సేకరించి, శాస్త్రీయ అధ్యయన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బాతిమెట్రిక్ సర్వే ద్వారా సముద్రపు లోతు, సీ బెడ్ స్థాయిలు, వాటి మార్పులను గుర్తిస్తున్నారు. బీచ్ ఆకృతి, వాలు, ఎత్తుపై అధ్యయనం కొనసాగుతోంది. షోర్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. తీర ప్రాంత కోతను అంచనా వేయడంలో ఈ అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుంది. ఉప్పాడ సముద్ర తీరం వెంబడి ప్రతిపాదిత రక్షణ గోడ నిర్మాణానికి అనువైన అలైన్‌మెంట్‌ను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. భవిష్యత్తులో సముద్ర కోత ప్రభావాన్ని సమర్థవంతంగా, సుదీర్ఘకాలం ఎదుర్కొనే విధంగా డిజైన్ రూపకల్పనకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఈ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐఐటీ మద్రాస్ ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి డిజైన్, డీపీఆర్ తదితర సాంకేతిక అంశాలపై దృష్టి సారించనుంది. గత నాలుగు దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వందల ఎకరాలు, పలు గ్రామాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఎంతో మంది నిర్వాసితులు కాగా, రైతులు వందల ఎకరాల పంట భూములను సైతం కోల్పోయారు. ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించిన ఉప ముఖ్యమంత్రి, సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపట్టారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ప్రతిపాదన మేరకు సీ ప్రొటెక్షన్ వాల్ , గ్రోయిన్ ఫీల్డ్, హోప్ ఐలాండ్ పరిసరాల్లో ప్రకృతి ఆధారిత తీర రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా డీపీఆర్ రూపకల్పన పనులు ప్రారంభమయ్యాయి. పిఠాపురం పర్యటన సందర్భంగా డిజైన్, డీపీఆర్ పై ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందంతో చర్చించనున్నారు. నిర్ణీత గడువు లోపు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా డిజైన్, డీపీఆర్ రూపకల్పన సమాంతరంగా పర్యావరణ, తదితర అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ఆదేశించారు.



# మాటల్లో కాదు.. పనుల్లో చూపిస్తున్నాం!

**రెండేళ్లలో 90 శాతం హామీల అమలు**

**టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మంత్రి సవిత**

**రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతో ఉపాధి కల్పన**

**త్వరలో బీసీ ప్రొటెక్షన్ యాక్ట్-2026**

**మంగళగిరి (సమయం న్యూస్):** ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని, ప్రతి కుటుంబానికి అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కేవలం రెండేళ్లలో 90 శాతం అమలు చేశామని, సంక్షేమాన్ని మాటల్లోనే కాదు.. గణాంకాల్లో కూడా చూపిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్ సందర్భంగా మంత్రి సవిత ప్రసంగించారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు, మహిళ, విద్యార్థి, బీసీ, మత్స్యకారుడు, చేనేత కార్మికుడు, దివ్యాంగుడు.. ఇలా ప్రతి వర్గానికీ అండగా నిలుస్తోందన్నారు.

### ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం..




ప్రజల సంక్షేమం కోసం భారీగా నిధులు ఖర్చు చేసి, మాట నిలబెట్టుకున్న ప్రభుత్వంగా నిలిచామని మంత్రి సవిత తెలిపారు. 24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందులో భాగంగా రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు తీసుకొచ్చి యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని వివరించారు. పేదలందరికీ విద్యా హక్కు కల్పించడంలో భాగంగా 'తల్లికి వందనం' పథకం కింద ఏటా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.15 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. ఇందుకోసం రెండేళ్లలో రూ. 20,090 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలోనే ఈ పథకం కింద 32,969 మంది విద్యార్థులకు రూ. 49.45 కోట్లు అందించామన్నారు.

### బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 138 బీసీ కులాల ఆత్మగౌరవానికి, రక్షణకు పెద్దపీట వేస్తూ 'బీసీ ప్రొటెక్షన్ యాక్ట్-2026' తీసుకురావడానికి చర్యలు చేపట్టామని మంత్రి సవిత వెల్లడించారు. బీసీల హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, 50 ఏళ్లు పైబడిన 1.30 లక్షల మంది మత్స్యకారులకు రూ.505 కోట్ల మేర పింఛన్లు అందించామని తెలిపారు. వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. అలాగే 50 ఏళ్లు పైబడిన 85 వేల మందికి పైగా చేనేత కార్మికులకు రూ.844 కోట్ల పింఛన్లు అందించామని తెలిపారు. 62,541 నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్‌తో పాటు, 'నేతన్నల సేవలో' పథకం కింద మగ్గం కలిగిన ప్రతి ఒక్కరికీ రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు.

# కొత్త అర్హులకూ అవకాశం

**సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ**

**స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

**అమరావతి, సెప్టెంబర్ 7:** రాష్ట్రంలో ప్రతి నెలా జరిగే 'పేదల పండుగ'ను ప్రభుత్వం మరో స్థాయికి తీసుకువెళ్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు. అర్హులైన వారు తమకు సంబంధించిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అర్హతను పరిశీలిస్తారు. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారు. అర్హులు దరఖాస్తును పూర్తి చేసి, అవసరమైన ధృవపత్రాలతో సంబంధిత స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రంలో సమర్పించాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తారు. అన్ని కేటగిరీలకు సాధారణంగా ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక ధృవపత్రాలను సమర్పించాలి. వృద్ధాప్య పింఛన్ కొరకు వయస్సు నిర్ధారణకు ఆధార్, వితంతు పింఛన్ కొరకు భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ నంబర్ ఉండాలి.



# భారతీయులపై ద్వేషం.. సింగపూర్ సీరియస్

**జాత్యహంకార వ్యాఖ్యలపై ప్రభుత్వ ఆగ్రహం**

**'సిగ్గుచేటు.. సహించరానివి' అన్న షణ్ముగం**

**పూర్తిస్థాయి విచారణకు పోలీసులకు ఆదేశం**

**ద్వేషపూరిత పోస్టుల తొలగింపునకు చర్యలు**

**బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**

**సింగపూర్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** సింగపూర్‌లో నివసిస్తున్న భారతీయులు, భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో వెలువడుతున్న జాత్యహంకార, ద్వేషపూరిత వ్యాఖ్యలను ఆ దేశ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఇటువంటి వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ.. వాటిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని పోలీసులను ఆదేశించింది. ఇటీవల చైనా-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన ప్రకృతి వైపరీత్యంలో పలువురు సింగపూర్ పౌరులు గల్లంతైన ఘటనతో పాటు ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడుల అంశాన్ని ముడిపెడుతూ కొందరు సామాజిక మాధ్యమాల్లో భారతీయులను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, సీనియర్ మంత్రులు కె.షణ్ముగం, లీ సీన్ లూంగ్ తీవ్రంగా స్పందించారు. భారతీయులను లక్ష్యంగా చేసుకుని చేసిన జాత్యహంకార వ్యాఖ్యలను సీనియర్ మంత్రి కె.షణ్ముగం తీవ్రంగా ఖండించారు. వాటిని "అత్యంత సిగ్గుచేటు, హేయమైనవి.. ఎంతమాత్రం సహించరానివి"గా అభివర్ణించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిపారు. బహుళ జాతులు, మతాలకు చెందిన ప్రజలు కలిసి జీవించే సింగపూర్‌లో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు చోటులేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏ వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నా ద్వేషపూరిత ప్రచారాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించింది. జాతి, మత సామరస్యానికి భంగం కలిగించే పోస్టులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డిజిటల్ అభివృద్ధి, సమాచార మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమ వేదికలను కోరింది. ఆన్‌లైన్‌లో ద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను సాధారణ విషయంగా మారనివ్వబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల వేదికగా ఏ ఒక్క జాతి లేదా వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని విద్వేషాన్ని వ్యాప్తి చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని సింగపూర్ ప్రభుత్వం హెచ్చరించింది.

# యెమెన్‌లో మళ్లీ భగ్గుమన్న హింస

**నాలుగు రోజుల్లో 117 మంది బలి**

**ప్రభుత్వ దళాలు, హౌతీల భీకర పోరు**

**తాయిజ్, హోదైదాల్లో వైమానిక దాడులు**

**బాబ్ అల్-మందబ్ సమీపంలో ఆందోళన**

**అడెన్, సెప్టెంబర్ 7 (ఉద్యమ కెరటం):** యెమెన్‌లో అంతర్యుద్ధం మళ్లీ తీవ్ర రూపం దాల్చింది. ప్రభుత్వ బలగాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య దేశ పశ్చిమ ప్రావిన్సులైన తాయిజ్, హోదైదాల్లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భీకర ఘర్షణల్లో కనీసం 117 మంది మరణించారు. వైద్య వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ పోరులో 54 మంది ప్రభుత్వ సైనికులు ప్రాణాలు కోల్పోగా, హౌతీ అధీనంలో ఉన్న ఆసుపత్రుల సమాచారం ప్రకారం 63 మంది తిరుగుబాటుదారులు మరణించారు. దీంతో ఇరుపక్షాల మృతుల సంఖ్య 117కు చేరింది. వ్యూహాత్మకమైన బాబ్ అల్-మందబ్ జలసంధి సమీపంలో హౌతీలు పెద్ద ఎత్తున దాడులకు దిగడంతో ఈ తీవ్ర ఘర్షణలు ప్రారంభమయ్యాయి. హౌతీల ముందడుగును అడ్డుకునేందుకు ప్రభుత్వ దళాలు జరిపిన మెరుపు ఎదురుదాడులు, వైమానిక దాడులతో యుద్ధ వాతావరణం మరింత వేడెక్కింది. ఇటీవల కాలంలో పశ్చిమ యెమెన్ భూభాగంలో ఇంతటి భారీస్థాయిలో భూతల పోరాటం జరగడం ఇదే మొదటిసారని విశ్లేషకులు భావిస్తున్నారు. 2014 చివర్లో హౌతీలు రాజధాని సనాతో పాటు ఉత్తర ప్రాంతాలను ఆక్రమించుకున్నప్పటి నుంచి మొదలైన ఈ అంతర్యుద్ధం, ప్రస్తుత ఘర్షణలతో మళ్లీ పూర్తిస్థాయి తీవ్ర రూపానికి చేరుతోందని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.



# 'ఫేక్ వీడియో అని నాకు తెలియదు'

- వివాదంపై అభిజిత్ దీప్కే వివరణ
- రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో పేరుతో వీడియో షేర్
- తప్పుదోవ పట్టించే పోస్టంటూ నెటిజన్ల విమర్శలు
- వ్యక్తిగత జీవితంపై అభ్యంతరం లేదన్న దీప్కే
- సామాజిక మాధ్యమాల్లో కొనసాగుతున్న చర్చ





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోను లక్ష్యంగా చేసుకుంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తాను షేర్ చేసిన వీడియో నకిలీదని ముందుగా తెలియదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వివరణ ఇచ్చారు. వీడియోలో ఉన్న వ్యక్తిని రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రాగా పేర్కొంటూ చేసిన పోస్టుపై విమర్శలు రావడంతో ఆయన స్పందించారు. "నేను షేర్ చేసిన వీడియో ఫేక్ అని నాకు తెలియదు. ఏదేమైనా ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిపై నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని దీప్కే పేర్కొన్నారు. బాబీ డియోల్ నటించిన 'జమాల్ కుడు' పాటకు ఓ వ్యక్తి నృత్యం చేస్తున్న వీడియోను దీప్కే ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అందులో కనిపిస్తున్న వ్యక్తి రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రా అని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎవరికి నచ్చినట్లు వారు ఉండడంలో తప్పులేదంటూనే.. ధర్మాన్ని కాపాడుతున్నామని చెప్పుకునే బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు తమ ప్రవర్తన గురించి ఆలోచించుకోవాలంటూ వ్యాఖ్యానించారు. అయితే వీడియోలో ఉన్న వ్యక్తి మిశ్రా కాదని తేలడంతో దీప్కే పోస్టుపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. ఒక రాజకీయ సంస్థ వ్యవస్థాపకుడిగా ఉన్న వ్యక్తి వీడియో వాస్తవికతను నిర్ధారించుకోకుండా ప్రముఖ వ్యక్తికి ఆపాదిస్తూ ఎలా ప్రచారం చేస్తారని పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వీడియోలు, చిత్రాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందంటూ వ్యాఖ్యానించారు. కాగా, జితేంద్ర మిశ్రా ఇటీవల రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోగా నియమితులైనట్లు కథనంలో పేర్కొన్నారు. ఆయన భారత వైమానిక దళంలో ఉన్నత స్థాయిలో సేవలందించి పదవీ విరమణ చేసిన ఎయిర్ మార్షల్ అని తెలిపింది. వీడియో నకిలీదని అంగీకరిస్తూ దీప్కే ఇచ్చిన వివరణతో వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# గ్యాస్ వినియోగదారులకు శుభవార్త

**గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్**


- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నియమం
- రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో మార్పులు
- కేంద్రం నుంచి కీలక ఉత్తర్వులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్‌ను 25 రోజులకే బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో అమల్లో ఉన్న 45 రోజుల వ్యవధిని తొలగిస్తూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఒకే విధంగా 25 రోజుల నిబంధనను వర్తింపజేయాలని నిర్ణయించింది. కొత్త విధానాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియంలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రీఫిల్ బుకింగ్ విషయంలో పట్టణ, గ్రామీణ వినియోగదారుల మధ్య ఇప్పటివరకు ఉన్న వ్యత్యాసం తొలగిపోనుంది. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. దేశంలో ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడటంతో పాటు పెండింగ్ రీఫిల్ బుకింగ్‌లు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు అమలు చేస్తున్న 45 రోజుల నిబంధనను సడలించి 25 రోజులకు తగ్గించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో కేంద్రం రీఫిల్ బుకింగ్‌పై తాత్కాలిక పరిమితులు తీసుకొచ్చింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని అమలు చేసింది. ప్రస్తుతం సరఫరా పరిస్థితులు మెరుగుపడటంతో గ్రామీణ ప్రాంతాల్లోని అదనపు పరిమితిని ఎత్తివేసింది. దీంతో ఇక పట్టణమైనా.. పల్లె అయినా 25 రోజుల తర్వాతే మరో ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకునేలా ఒకే నిబంధన అమల్లోకి రానుంది.

# దేశ ప్రగతికి మహిళలే మార్గదర్శకులు

- భారత చరిత్రలో వారి పాత్ర కీలకం
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు చెరగని ముద్ర
- అన్ని రంగాల్లో మహిళల అద్భుత విజయాలు
- నాయకత్వ పటిమకు మరిన్ని అవకాశాలు కల్పించాలని పిలుపు
- మహిళా శాసనసభ్యులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ



**ఫరీదాబాద్, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలిచారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు ప్రతి కీలక ఘట్టంలోనూ మహిళలు చెరగని ముద్ర వేశారని కొనియాడారు. నేడు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఓం బిర్లా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని ఓం బిర్లా పేర్కొన్నారు. దేశ సంస్థాగత నిర్మాణంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడంలోనూ మహిళల సహకారం, నాయకత్వం మరువలేనిదన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు మార్పునకు ప్రతీకలుగా నిలవడమే కాకుండా వివిధ రంగాల్లో అపూర్వ విజయాలు సాధిస్తూ తమ నాయకత్వ సామర్థ్యాన్ని చాటుతున్నారని ప్రశంసించారు. మహిళల్లో సహజసిద్ధంగా ఉన్న నాయకత్వ లక్షణాలను గుర్తించి వాటిని మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఓం బిర్లా అన్నారు. మహిళా సాధికారతతో పాటు వారి సామర్థ్యాలను పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. మహిళా శాసనసభ్యుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఆయన అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు మహిళా ప్రజాప్రతినిధుల్లో కొత్త స్ఫూర్తిని నింపడంతో పాటు ప్రజాసేవలో మరింత సమర్థంగా పనిచేసేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ శిక్షణ ద్వారా మహిళా శాసనసభ్యులు కొత్త అంశాలపై అవగాహన పెంచుకుని, తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలరని ఓం బిర్లా ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సహించం

**ప్రతిపక్ష డీఎంకేపై సీఎం విజయ్ తీవ్ర ఆగ్రహం.. డీఎంకే అవినీతిపై సీఎం దాడి**

**అసెంబ్లీలో పాత నివేదికల రచ్చ.. మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై హెచ్చరిక**

**చెన్నై, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** తమిళనాడు శాసనసభ సాక్షిగా తమిళగ వెట్రి కజగం (టీవీకే) వ్యవస్థాపకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ, డీఎంకే హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా సభ ముందుంచారు. రాజకీయ విమర్శలను ప్రజాస్వామ్యంలో స్వాగతిస్తామని, అయితే మహిళలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభ ముఖంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. డీఎంకే నాయకులు ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను సభలో ఉటంకించిన సీఎం విజయ్, వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్టులో కమీషన్లు దండుకున్న చరిత్ర డీఎంకేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఈడీ నమోదు చేసిన ఆరోపణలను ఆయన ప్రస్తావించారు. కాంట్రాక్టులు, పార్టీ ఫండ్ల పేరుతో శాతాల వారీగా కమీషన్లు దండుకున్న దాఖలాలు రికార్డుల్లో ఉన్నాయని మండిపడ్డారు. తాను అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదని, ఎంజీఆర్, ఎన్టీఆర్ వంటి మహానాయకుల వారసత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

# ప్రభుత్వ ఉద్యోగులకు సోషల్ మీడియా కట్టడి?

**కేంద్రం కొత్త నిబంధనలు!.. త్వరలో సోషల్ మీడియా కోడ్..**

**ఉద్యోగులందరికీ ఒకే నిబంధన.. వ్యక్తిగత ప్రచారంపై ప్రత్యేక దృష్టి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వేదికలపై చేసే పోస్టులపై కట్టడి విధించేందుకు గాను ప్రత్యేకంగా 'సోషల్ మీడియా కోడ్ ఆఫ్ కండక్ట్' తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి వేదికల్లో ఉద్యోగుల ప్రవర్తన, పోస్టులపై పరిమితులు విధించే దిశగా కొత్త నిబంధనలు రూపొందిస్తున్నట్లు ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల ప్రభుత్వ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించి, దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సీనియర్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈ నూతన నిబంధనలు అమల్లోకి వస్తే హోదాతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకే తరహా కోడ్ వర్తిస్తుంది. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూట్యూబ్ ఛానళ్లు నడపడం, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేయడం, అధికారిక విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలు పంచుకోవడం ఎక్కువవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయా శాఖల సర్వీస్ రూల్స్ మాత్రమే అమల్లో ఉండటంతో డిజిటల్ మీడియా విస్తృతికి అనుగుణంగా ఏం పోస్ట్ చేయవచ్చు, ఏం చేయకూడదు, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ఉంటాయనే అంశాలపై కొత్త కోడ్ ద్వారా స్పష్టత రానుంది.

# మెడికల్ అడ్మిషన్లలో రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం

- జీవో 102ను రద్దు చేసి.. జీవో 151 ప్రకారం సీట్లు కేటాయించాలి
- ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్



**మంగళగిరి సెప్టెంబర్ 7(సమయం న్యూస్):** మెడికల్ అడ్మిషన్లలో ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన జీవో 102 కారణంగా రిజర్వేషన్ వర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆరోపించారు. రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు సామాజిక న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో 'మెడికల్ అడ్మిషన్లు–జీవోలు 102 & 151' అనే అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో కేసన శంకరరావు మాట్లాడారు. గతంలో జీవో 151 ప్రకారం ఎంబీబీఎస్ అడ్మిషన్లు నిర్వహించిన సమయంలో రిజర్వేషన్ వర్గాలతో పాటు అన్ని వర్గాల విద్యార్థులకు సమన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఓపెన్ కాంపిటీషన్ కటాఫ్ ర్యాంకు కంటే మెరుగైన ర్యాంకు సాధించిన రిజర్వేషన్ వర్గాల విద్యార్థులను గతంలో జీవో 151 ప్రకారం ఓపెన్ కేటగిరీలోనే పరిగణించి ఎంబీబీఎస్ సీట్లు కేటాయించేవారని కేసన శంకరరావు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో 102 కారణంగా రిజర్వేషన్ వర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో సీట్లు ఇవ్వకుండా, వారి సంబంధిత రిజర్వేషన్ కేటగిరీలోనే సీట్లు కేటాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల మెరిట్ సాధించిన రిజర్వేషన్ వర్గాల విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో పొందాల్సిన అవకాశాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ రీజియన్‌లో ఓపెన్ కాంపిటీషన్ కటాఫ్ ర్యాంకు 71,547గా ఉండగా, అంతకంటే మెరుగైన ర్యాంకులు సాధించిన 43 మంది రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో కాకుండా రిజర్వేషన్ కేటగిరీలో సీట్లు కేటాయించడం అన్యాయమని కేసన శంకరరావు అన్నారు. అదేవిధంగా ఎస్వీయూ రీజియన్‌లో ఓపెన్ కాంపిటీషన్ కటాఫ్ ర్యాంకు 94,966గా ఉందని, అంతకంటే మెరుగైన ర్యాంకులు సాధించిన 27 మంది రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు కూడా ఓపెన్ కేటగిరీలో కాకుండా రిజర్వేషన్ కేటగిరీలో సీట్లు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రెండేళ్లలో 2,450 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయామని ఆరోపణ జీవో 102 కారణంగా గత రెండేళ్లలో రిజర్వేషన్ వర్గాలు సుమారు 2,450 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయాయని కేసన శంకరరావు ఆరోపించారు. మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో సీట్లు పొందాల్సిన విద్యార్థులను రిజర్వేషన్ కేటగిరీలోకి పరిమితం చేయడం వల్ల రిజర్వేషన్ వర్గాల్లోని ఇతర విద్యార్థులకు దక్కాల్సిన సీట్ల సంఖ్య కూడా తగ్గిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ వర్గానికి చెందిన విద్యార్థి ఓపెన్ కేటగిరీ మెరిట్‌కు అర్హత సాధించినప్పుడు అతడిని ఓపెన్ కేటగిరీలోనే పరిగణించాలని, అలా చేయడం వల్ల రిజర్వేషన్ కోటాలోని సీట్లు ఆ వర్గాల ఇతర అర్హులైన విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని వివరించారు. జీవో 102 ప్రకారం ఇప్పటికే నిర్వహించిన మెడికల్ అడ్మిషన్లను రద్దు చేసి, పాత జీవో 151 ప్రకారం తిరిగి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులు చేపట్టాలని కేసన శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 151 ప్రకారం సీట్ల కేటాయింపులు జరిగితే రిజర్వేషన్ వర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో సీట్లు లభిస్తాయని, అదే సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వారి రిజర్వేషన్ మేరకు మరిన్ని సీట్లు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. తద్వారా రిజర్వేషన్ వ్యవస్థ ఉద్దేశం నెరవేరడంతో పాటు సామాజిక న్యాయం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అన్నారు. ఈ వ్యవహారంపై వైద్య శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలని కేసన శంకరరావు కోరారు. మెడికల్ అడ్మిషన్లలో నెలకొన్న పరిస్థితిని సమీక్షించి, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెరిట్‌తో పాటు రిజర్వేషన్ హక్కులకు కూడా రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం అడ్మిషన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు తిరువీధుల కిరణ్, జిల్లా యువజన నాయకుడు ధనుంజయరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటకృష్ణ, దానా గౌడ్తో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు. మెడికల్ అడ్మిషన్లలో రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ఫైనాన్స్ బకాయిల పేరుతో వాహనాల స్వాధీనం?

**విజయ గణేష్ మోటార్స్‌పై బాధితుడి ఆరోపణలు..**



**గుంటూరు సెప్టెంబర్ 6 (సమయం న్యూస్):** ఫైనాన్స్ బకాయిల పేరుతో తన వాహనాలను స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ ఓ వాహన యజమాని సోమవారం జిల్లా ఎస్పీని ఆశ్రయించాడు. విజయ గణేష్ మోటార్స్‌కు చెందిన వ్యక్తులు తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించాడు. బాధితుడి వివరాల ప్రకారం.. గత జూన్ 16న ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా రూ.70 వేల రుణం తీసుకుని ఏపీ39 జీ 9689 నంబరు గల వాహనాన్ని కొనుగోలు చేశాడు. రుణానికి సంబంధించిన మూడు వాయిదాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, మిగిలిన మొత్తాన్ని చెల్లించినప్పటికీ అదనంగా రూ.1,15,822 వడ్డీ చెల్లించాలని ఫైనాన్స్ నిర్వాహకులు కోరుతున్నారని తెలిపాడు. అంతేకాకుండా ఫైనాన్స్‌లో ఉన్న వాహనంతో పాటు తనకు చెందిన మరో రెండు వాహనాలను కూడా ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లారని ఆరోపించాడు. మొత్తం బకాయి చెల్లిస్తేనే వాహనాలను తిరిగి ఇస్తామని చెబుతున్నప్పటికీ, వాటిని అప్పగించడం లేదని పేర్కొన్నాడు. ఈ వ్యవహారంపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఫిర్యాదుపై కొత్తపేట సీఐ విచారణ చేపట్టినట్లు వెల్లడించాడు. ఫైనాన్స్ బకాయిలు, వడ్డీ లెక్కలు, ఇతర రెండు వాహనాల స్వాధీనం తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. బాధితుడి ఆరోపణలపై వివరణ వెలువడాల్సి ఉంది. పోలీసుల విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# 22 (ఎ) కేసులు త్వరగా పరిష్కరించాలి



**గుంటూరు, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** 22 (ఎ) కేసులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులో పరిష్కారం కావాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక, 22 (ఎ) కేసులు తదితర అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీలు పట్ల స్పష్టమైన విచారణ చేయాలన్నారు. అర్జీలపై సంతృప్తికరమైన పరిష్కారం చూపించాలని, పరిష్కారం కాని వాటికి సరైన ఎండార్స్ మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్దేశిత సమయం దాటరాదని చెప్పారు. అధికారులందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఎండార్స్ మెంట్ సక్రమంగా ఇవ్వని అధికారులు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న సంగతి గుర్తించాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పక్కాగా, సంతృప్తికర రీతిలో అందుటకు ప్రతి శాఖ శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సేవలు బాగా అందించడం ద్వారా మనకు సంతృప్తి లభిస్తుందని గ్రహించాలని ఉద్బోధించారు. పురపాలక సంఘాల పరిధిలో రహదారుల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. జలధార క్రింద మంజూరైన చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరుకు జాతీయ స్థాయి గౌరవం

**స్వచ్ఛ వాయు సర్వేక్షన్-2026లో ద్వితీయ స్థానం**

**రాష్ట్ర స్థాయిలో 42వ వార్డుకు ప్రథమ స్థానం.. ఢిల్లీలో అవార్డులు అందుకున్న కమిషనర్ మయూర్ అశోక్**





**గుంటూరు, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** వాయు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో గుంటూరు నగరపాలక సంస్థ మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపును సాధించింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షన్--2026'లో గుంటూరు నగరం జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. దేశవ్యాప్తంగా 130 నగరాల మధ్య నిర్వహించిన ఈ పోటీల్లో గుంటూరు మెరుగైన ప్రతిభ కనబరిచి లిలినేషనల్ క్లీన్ ఎయిర్ సిటీలిలిగా ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందింది. ఒకే వేదికపై గుంటూరు నగరపాలక సంస్థకు రెండు అవార్డులు దక్కడం విశేషంగా నిలిచింది. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు జీఎంసీ చేపట్టిన పలు చర్యలకు ఈ అవార్డు దక్కినట్లు అధికారులు తెలిపారు. ఈ-ఆటోల ద్వారా చెత్త సేకరణ, ప్రధాన రహదారులపై మెకనైజ్ట్ స్వీపింగ్, ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, రోడ్లపై దుమ్ము లేవకుండా నీటి స్ప్రేయింగ్ వంటి చర్యలు అమలు చేస్తున్నారు. అదేవిధంగా వార్డు స్థాయిలో ఆర్ఆర్ఆర్ సెంటర్లు, సీ అండ్ డీ వ్యర్థాల సేకరణ పాయింట్లు, క్లస్టర్ కంపోస్ట్ యూనిట్లు ఏర్పాటు చేసి వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. డ్రెయిన్ టు డ్రెయిన్ రోడ్ల నిర్మాణం వంటి చర్యలు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. జాతీయ స్థాయిలో నగరానికి ద్వితీయ స్థానం దక్కడంతో పాటు రాష్ట్ర స్థాయిలో లిలివార్డుల కేటగిరీ-2 (10 వేల నుంచి 30 వేల జనాభా)లిలిలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 42వ వార్డు ప్రథమ స్థానంలో నిలిచింది. 'స్వచ్ఛ వాయు దివస్' సందర్భంగా సోమవారం న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అవార్డులను స్వీకరించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాష్ శ్రీవాస్తవ, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్, అదనపు కార్యదర్శి అమన్ దీప్ గార్గ్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 130 నగరాలతో పోటీపడి గుంటూరు ద్వితీయ స్థానంలో నిలవడం నగరవాసులందరికీ గర్వకారణమన్నారు. వాయు నాణ్యత మెరుగుదలకు క్షేత్రస్థాయిలో కృషి చేసిన పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో గుంటూరును మరింత పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, పచ్చని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీఎంసీ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్, కోమలి తదితరులు పాల్గొన్నారు.




# పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

**అధికారులకు జీఎంసీ అదనపు కమిషనర్ ఆదేశాలు**

**గుంటూరు, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ (జీఎంసీ) ఇంచార్జ్ అదనపు కమిషనర్ జి. సాంబశివరావు అధికారులను ఆదేశించారు. నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అధికారులు తప్పనిసరిగా హాజరై తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో సాంకేతిక ఇబ్బందులు ఉంటే దరఖాస్తుదారులకు స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, నిర్ణీత గడువు దాటితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 35 అర్జీలు రాగా.. పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్‌కు 13, రెవెన్యూకు 6, ఉపా సెల్‌కు 2, ప్రజారోగ్య విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సి.హెచ్. శ్రీనివాసరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ సహా పలువురు జీఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**గుంటూరు సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** నగరంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లోని అన్ని లైన్లు, చంద్రమౌళి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన విద్యుత్ సంబంధిత పనులను చేపట్టనున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచే సమయంలో వినియోగదారులు శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. నిర్ణీత సమయం అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు విద్యుత్ శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పటాన్ హుస్సేన్ ఖాన్, టౌన్-2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. గురవయ్య సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.

# టిడ్కో ఇళ్ల పరిస్థితి దారుణం

**సీపీఎం నేత బాబురావు**



**గుంటూరు సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** నగరంలోని టిడ్కో గృహాలు, జగనన్న కాలనీల పరిస్థితిపై సీపీఎం నేత బాబురావు ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ల పరిస్థితి దారుణంగా మారిందని ఆరోపించారు. ఇళ్లు మంజూరై, నిర్మాణం పూర్తయినప్పటికీ అనేక మంది లబ్ధిదారులు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులపై ఉన్న బ్యాంకు రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని బాబురావు డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇళ్లను అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన పథకం ద్వారా లబ్ధిదారులకు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్లకు సంబంధించిన మౌలిక వసతులు, ఇతర సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. లబ్ధిదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లతో పాటు జగనన్న కాలనీల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బాబురావు స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లబ్ధిదారులపై ఆర్థిక భారం పడకుండా తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

**గుంటూరు, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయ కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. సచివాలయాల్లో నమోదు పూర్తయిన తర్వాత క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, సెప్టెంబర్ 24 నాటికి జాబితాలను ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నట్లు చెప్పారు. అర్హత ఉండి పింఛన్ అందుకోలేకపోతున్న వారికి ఇదొక మంచి అవకాశమని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డీఆర్డీఏ పీడీ వి.విజయ లక్ష్మి సహా పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో మందుల కొరత.. రోగుల అవస్థలు

- బయట నుంచి కొనుగోలు చేయాలని సూచనలు.. నిరుపేదలపై అదనపు భారం
- సుమారు 80 రకాల అత్యవసర ఔషధాల కొరత ఉన్నట్లు సమాచారం




**గుంటూరు సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించే గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో ఔషధాల కొరత రోగులు, వారి బంధువులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. గుంటూరుతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి నిత్యం వేలాది మంది చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తుంటారు. సుమారు 1,500 పడకల సామర్థ్యం ఉన్న ఆసుపత్రిలో అత్యవసర సేవల కోసం పెద్ద సంఖ్యలో రోగులు చేరుతుంటారు. గుండె, కిడ్నీ, నరాలు, జీర్ణకోశ సమస్యలు, క్యాన్సర్, ప్రసూతి తదితర విభాగాల్లో వైద్య సేవలు అందుతున్నాయి. అయితే కొంతకాలంగా అవసరమైన కొన్ని ఔషధాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగులు చెబుతున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో దాదాపు 100 రకాల మందులు అందుబాటులో లేవని, వాటిలో సుమారు 80 రకాల ఔషధాలు జీజీహెచ్‌కు అత్యవసరంగా అవసరమవుతున్నట్లు సమాచారం. ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేని సందర్భాల్లో బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాలని కొందరు వైద్యులు సూచిస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. దీంతో ఉచిత వైద్యం కోసం వచ్చిన నిరుపేదలు సైతం మందుల కోసం అదనపు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కొన్ని మందులు బయట కూడా లభించకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. జీజీహెచ్‌లో వైద్య మౌలిక వసతులను ప్రభుత్వం మరింత అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఔషధాల సరఫరాపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. కొరతకు కారణాలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో సమన్వయం చేసుకుని అవసరమైన మందులను సకాలంలో సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వేలాది మంది నిరుపేదలకు ఆధారంగా ఉన్న జీజీహెచ్‌లో అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

# మహిళ దారుణ హత్య



**ఆభరణాలు, నగదు అపహరణ.. నిందితుల కోసం పోలీసుల గాలింపు**

**పెదకాకాని సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. డి. కోటేశ్వరమ్మ (47) అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు సమాచారం. అనంతరం ఆమె వద్ద ఉన్న ఆభరణాలు, నగదును అపహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కోటేశ్వరమ్మకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు దారితీసిన కారణాలు, నిందితుల వివరాలను తెలుసుకునేందుకు ఆధారాలను సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత హత్యకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఉత్తమ క్రీడాభివృద్ధి అధికారిగా అఫ్రోజ్ ఖాన్‌కు అవార్డు



**గుంటూరు సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేసిన గుంటూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీ అఫ్రోజ్ ఖాన్‌ను ఆంధ్రప్రదేశ్ ఉత్తమ క్రీడాభివృద్ధి అధికారి అవార్డుతో సత్కరించారు. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించడం, క్రీడా ప్రతిభను వెలికితీయడం, క్రీడా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం తదితర అంశాల్లో అఫ్రోజ్ ఖాన్ చేసిన విశేష కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ సి.ఎం. సాయికాంత్ వర్మ, ఐఏఎస్ అఫ్రోజ్ ఖాన్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా క్రీడల అభివృద్ధికి మరింత కృషి చేసి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# బైక్ దొంగ అరెస్ట్.. 22 వాహనాలు స్వాధీనం

**నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసుల చర్య**



**నరసరావుపేట, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** పల్నాడు జిల్లా నరసరావుపేట ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఎస్ఐ వంశీకృష్ణ, క్రైమ్ సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. నరసరావుపేట ఫస్ట్ గేట్ నుంచి శాలింనగర్ వైపు వెళ్లే మార్గంలో నిందితుడు మణికంఠను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. చోరీకి గురైన ద్విచక్ర వాహనాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకుని వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీ అభినందించారు.

# దళిత యువకుడి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

**కలెక్టర్ ప్రజా ఫిర్యాదుల వేదికలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వినతి**



**గుంటూరు సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన దళిత యువకుడు చీకటి గోపి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేద్కర్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ ప్రజా ఫిర్యాదుల వేదికలో వినతిపత్రం సమర్పించారు. దొంగతనం ఆరోపణలపై గోపిని తాడికొండ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించిన అనంతరం అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందడం బాధాకరమన్నారు. పోలీసులు కొట్టడం వల్లే గోపి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరిపించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధారా అంబేద్కర్ కోరారు.

# తాడేపల్లిలో రెడ్డి సంఘాల సమాఖ్య కార్యాలయం ప్రారంభం

**22 రెడ్డి సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే లక్ష్యం**



**తాడేపల్లి సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** రాష్ట్రంలోని రెడ్డి సంఘాలను సమన్వయం చేసి ఐక్యంగా పనిచేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘాల సమాఖ్య కేంద్ర కార్యాలయం తాడేపల్లి బైపాస్ రోడ్డులో ప్రారంభమైంది. ముఖ్య అతిథి దొంతిరెడ్డి వేమారెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించారు. సమాఖ్య అధ్యక్షుడు కూరపాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 రెడ్డి సంఘాలు సభ్యత్వం పొందాయని తెలిపారు. పేద రెడ్డి రైతులు, విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలవడమే సమాఖ్య ప్రధాన లక్ష్యమన్నారు. యోగివేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్. చంగారెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్‌ను పునరుద్ధరించి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల రెడ్డి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్‌ను అడ్డుకునే కుట్ర: గళ్లా మాధవి



**గుంటూరు, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్):** కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడమే వైసీపీ పనిగా మారిందని గుంటూరు ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 148 రోజుల్లో మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసి 15,941 ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. క్రీడా కోటా ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వారి భవిష్యత్‌తో ఆడుకోవడమేనన్నారు. రానున్న డీఎస్సీ నియామకాలను కూడా అడ్డుకునేందుకు ఇప్పటి నుంచే వైసీపీ కుట్రపూరిత ప్రచారం ప్రారంభించిందని గళ్లా మాధవి ఆరోపించారు. యువత జీవితాలతో రాజకీయాలు చేయొద్దని జగన్‌రెడ్డిని కోరుతున్నామని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.



# ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7(సమయం న్యూస్):** దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'రైస్ అవుట్‌లెట్'ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సీసీఎఫ్ ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# వినాయక మండపాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

**సింగిల్ విండో విధానంలో ఉచితంగా అనుమతులు.. ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులో**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్**

**గుంటూరు సెప్టెంబరు 6 (సమయం న్యూస్):** జిల్లాలో వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ స్పష్టం చేశారు. అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు పోలీస్, ఫైర్, మున్సిపల్/పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ శాఖల అనుమతులను ఒకే చోట పొందేలా ఆన్‌లైన్ సింగిల్ విండో విధానం అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వినాయక ఉత్సవ నిర్వాహకులు స్త్రుఖఅవంస్త్రబ్-ఖ్రజ.అవ్ పోర్టల్‌లో మొబైల్ నంబర్, ఌూ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైన వివరాలు, పత్రాలు సమర్పించిన అనంతరం సంబంధిత అధికారులు పరిశీలన చేసి అనుమతులు మంజూరు చేస్తారు. అనుమతి పొందిన తర్వాత ఌ= కోడ్‌తో కూడిన డిజిటల్ చీూజను డౌన్‌లోడ్ చేసుకుని మండపం వద్ద ప్రదర్శించాలి. మండపాల వల్ల ప్రజల రాకపోకలు, అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ల రాకకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద విద్యుత్, అగ్నిమాపక, పారిశుధ్య భద్రతా ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల జఋఎలు ఏర్పాటు చేయాలని తెలిపారు. లౌడ్‌స్పీకర్లు, డీజేలకు ముందస్తు అనుమతి తప్పనిసరని, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషేధమని స్పష్టం చేశారు. ఊరేగింపుల్లో పోలీసులు సూచించిన మార్గాలు, సమయాలను మాత్రమే పాటించాలని సూచించారు. అధికారికంగా గుర్తించిన ప్రాంతాల్లోనే విగ్రహాల నిమజ్జనం నిర్వహించాలని ఎస్పీ సూచించారు. నదులు, కాలువలు, చెరువులు, తాగునీటి వనరుల్లో అనధికారిక నిమజ్జనం చేయరాదన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, లైఫ్ జాకెట్లు, శిక్షణ పొందిన ఈతగాళు ౢ, అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ సిబ్బంది వంటి భద్రతా ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అనధికారిక ఊరేగింపులు నిర్వహించినా, శబ్ద కాలుష్య నిబంధనలు అతిక్రమించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీస్ శాఖకు సహకరిస్తూ వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.





# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

## దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరపున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

# రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు!

## పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం

పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆ దేశ ఆటగాళ్లపై ఏకంగా ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంతర్గత విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానస్పదంగా ఉందనే వార్తలు కలకలం సృష్టించాయి. ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ ఘోర పరాజయాల నేపథ్యంలో పీసీబీ కూడా కఠిన చర్యలు తీసుకుంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. దాంతో పాకిస్థాన్ జట్టు అప్రతిష్టపాలై ఇంట బయట తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ ఘోర పరాజయాలకు క్రికెటర్ల వైఫల్యంతో పాటు... ఫిక్సింగ్ కూడా ఓ కారణమని మీడియాలో కథనాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా వేటుకు గురైన ఏడుగురిలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ మొబైల్ డేటాను పీసీబీ స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతుందని పాక్‌కు చెందిన జియో న్యూస్ పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. పీసీబీ అధికారులు.. కేవలం ఆటగాళ్ల ప్రవర్తననే కాకుండా.. వారు సంప్రదించిన వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రావాల్సి ఉన్నప్పటికీ.. రిజ్వాన్, ఇమామ్ భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు రిజ్వాన్, ఇమామ్‌లను ఎంపిక చేయడంపై వివరణ కోరుతూ సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మూడో టెస్ట్ ఆడే ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ వార్తా సంస్థ 365 న్యూస్ పేర్కొంది. మ్యాచ్ ముగిసే వరకు ఆటగాళ్లకు మొబైల్స్ ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు రాసుకొచ్చింది. బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యం పాక్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణపరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం. ఈ విషయాలను అంతర్గతంగా సమీక్షిస్తాం. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనల మేరకు విచారణ కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలను విశ్వసించవద్దని కోరుతున్నాం. ప్రస్తుతానికైతే పీసీబీ ఈ వ్యవహారంపై ఎలాంటి కామెంట్ చేయడం లేదు. అభిమానులు, వాటాదారులు అందరూ పీసీబీ నుంచి అధికారికంగా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలి' అని అమిర్ మిర్ పేర్కొన్నాడు. కానీ ఆటగాళ్ల మొబైల్స్ లాక్కున్నారనే వార్తలపై అతను స్పందించలేదు.



# భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది





మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది. గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిపిందే. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు. అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

# సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్ సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి. హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. శ్రేయాస్ గోపాల్ ఈ జోడీని విడదీసాడు. ఖరేషి(40)ని క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 700 ధాటించాడు. అతనితో పాటు ముఖేష్ కుమార్(0)ను



విజయ్ పెవిలియన్ చేర్చి ఈస్ట్ జోన్ భారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో రెండో రోజు ఆట ముగిసింది.

# వరల్డ్ కప్‌లో భువీ కచ్చితంగా ఉండాల్సిందే..

## సెలక్టర్లకు మాజీ క్రికెటర్ విజ్ఞప్తి

భారత జట్టుకు విశేష సేవలందించిన సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు 2027 వన్డే ప్రపంచకప్‌లో అవకాశం కల్పించాలని భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా డిమాండ్ చేశారు. ఐపీఎల్ తో పాటు ఇటీవల ముగిసిన యూపీ టీ20 లీగ్‌లో భువీ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలోనే సెలెక్టర్లు భువీ పేరును పరిశీలించాలని రైనా సూచించారు. అక్టోబర్-నవంబర్ 2027లో సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల్లో వన్డే ప్రపంచకప్ జరగనుంది. ఆయా దేశాల్లో ఉండే వేగవంతమైన, స్వింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై భువనేశ్వర్ అనుభవం, బంతిపై అతనికున్న నియంత్రణ భారత జట్టు విజయాలకు ఎంతో కీలకంగా మారుతాయని రైనా అభిప్రాయపడ్డారు. యూపీ టీ20 లీగ్‌లో లక్నో ఫాల్కన్స్ జట్టు తరఫున ఆడిన భువనేశ్వర్ కుమార్ 11 మ్యాచుల్లో 14 వికెట్లు పడగొట్టారు. కేవలం వికెట్లే కాకుండా ఆయన వేసిన పొదుపైన బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంది. మొత్తం 11 మ్యాచుల్లో ఆయన ఏకంగా 119 డాట్ బాల్స్



వేశారు. అంటే దాదాపు 20 ఓవర్ల పాటు ప్రత్యర్థి బ్యాటర్లకు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా కట్టిపడేసారు. అంతేకాకుండా కేవలం 6.11 ఎకానమీ రేటుతో పరుగులు ఇచ్చి తనలోని పదును ఇంకా తగ్గలేదని నిరూపించారు. బౌలింగ్‌లో స్వింగ్, వైవిధ్యంతో ప్రత్యర్థులను తిప్పలు పెట్టడంలో భువీ శైలి ప్రత్యేకం. భారత జట్టు రాబోయే రోజుల్లో యువత, అనుభవం కలయికతో ముందుకు వెళ్లాలని రైనా ఆకాంక్షించారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీల అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో ఉన్నట్లే, బౌలింగ్ విభాగంలో ఈ ఇద్దరు సీనియర్ పేసర్లు కూడా గిల్ ప్రణాళికల్లో భాగం కావాలని తెలిపారు. ముగ్గురు లేదా నలుగురు స్పెషలిస్ట్ పేసర్లను ఎంపిక చేసే క్రమంలో భువీ అనుభవాన్ని విస్మరించకూడదని వివరించారు. ఇక మీరట్ మెవ్రిక్స్ జట్టును విజేతగా నిలిపిన రింకూ సింగ్ కెప్టెన్సీ టాలెంట్ పై కూడా రైనా ప్రశంసల జల్లు కురిపించారు. ఒత్తిడి సమయంలో రింకూ ప్రదర్శించిన వ్యూహాత్మక చతురత అద్భుతమని కొనియాడారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యం రింకూ సింగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దేశవాళీ టాలెంట్‌ను వెలికితీయడంలో యూపీ టీ20 లీగ్ ఎంతగానో తోడ్పడుతోందని కొనియాడారు.

# ఇద్దరూ ఒకే సిగరెట్ తాగుతూ..

### మరోసారి అడ్డంగా దొరికిపోయిన జయం రవి-కెనీషా

చెన్నై, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్): కోలీవుడ్ ప్రముఖ నటుడు జయం రవి (రవి మోహన్), సింగర్ కెనీషాతో కలిసి ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతోంది. గత కొన్ని రోజులుగా భార్య ఆర్తితో విడాకుల వ్యవహారం కోర్టులో నడుస్తుండగా, కెనీషాతో రవి సన్నిహితంగా ఉంటున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో ఊపందుకుంది. ఈ క్రమంలో వారిద్దరూ కలిసి ఉన్న సరికొత్త వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సదరు వీడియోలో జయం రవి, కెనీషాతో పాటు మరికొందరు ఒక గ్రూప్ మీటింగ్‌లో పాల్గొన్నట్లు కనిపిస్తోంది. ఆ తీవ్ర చర్చల సమయంలో జయం రవి సిగరెట్ తాగి, దానిని కెనీషాకు అందించడం, ఆమె కూడా దానిని పీల్చడం స్పష్టంగా నమోదైంది. గతంలో తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని, విడాకులు పూర్తయ్యే వరకు నటనకు విరామం ఇస్తున్నానని ప్రకటించిన రవి.. ఇటీవల తిరుమల దర్శనంలోనూ, ఇప్పుడు ఈ వీడియోలోనూ కెనీషాతో కలిసి కనిపిస్తుండటంపై అభిమానులు, నెటిజన్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరంభంలో జయం రవికి మద్దతు తెలిపిన పలువురు నెటిజన్లు, ఈ ఘటనలతో తమ అభిప్రాయం మారిపోయిందని విమర్శలు గుప్పిస్తున్నారు.





# 'రంభ ఊర్వశి మేనక' కలెక్షన్స్ జోరు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్): ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ 'రంభ ఊర్వశి మేనక'పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి. కథ పరంగా కన్ఫ్యూజన్ ఏమి లేదు, రన్‌టైమ్ తక్కువగా ఉండటం, నరేష్ తన మార్క్ కామెడీతో నెట్టుకురావడం సినిమాకు కలిసొచ్చింది. దర్శకుడు చంద్రమోహన్ నరేష్ కు తగ్గ ఫన్ ను క్రియేట్ చేశాడు, హాస్య మూవీస్ నిర్మాణ విలువలు సినిమా స్కేల్‌కు సరిపోయేలా ఉన్నాయి. పెద్దగా హంగులకు పోకుండా కేవలం ఫన్ ట్రాక్స్‌పైనే ఫోకస్ పెట్టడంతో బాక్సాఫీస్ వద్ద వీకెండ్ వరకు ఒక మోస్తరుగా నిలబడగలిగింది. అయితే చిత్రానికి అసలైన ఛాలెంజ్ సోమవారం నుంచే మొదలవుతోంది. వీకెండ్‌లో వచ్చిన డీసెంట్ నంబర్స్ మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు వర్కింగ్ డేస్‌లో కంటిన్యూ అవ్వడం అంత సులువు కాదు. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.






# ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్): లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. అరుంధతి, భాగమతి, బాహుబలి వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం -కథనార్: ది విల్డ్ సోర్సరర్- లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. -కథనార్- చిత్రం పాన్-ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ ఫలితం తారుమారైతే స్వీటీ పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమకు గుడ్ బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అనుష్క శెట్టి గ్లామర్ పాత్రలకే పరిమితం కాలేదు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హీరోలకు సమానంగా వసూళ్లు రాబట్టిన నటి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న అమ్మడు పరిశ్రమను వీడుతున్నారనే వార్తలు అభిమానులను నిరాశకు గురి చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా స్వీటీ తిరిగి పూర్తిస్థాయిలో సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఏది ఏమైనా? -కథనార్- చిత్రం విడుదలయ్యే వరకు ఈ ప్రచారాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అనుష్క నిర్ణయం ఏదైనా? అమ్మడు మళ్లీ పూర్వ వైభవంతో వెండితెరపై మెరవాలని.. మరిన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు మాత్రం బలంగా కోరుకుంటున్నారు.

# 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?




హైదరాబాద్, సెప్టెంబర్ 7 (సమయం న్యూస్): నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది. ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA**, PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**